ప్రజాశక్తి

సోమవారం 15 డిసెంబర్ 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

మద్దతు ధర ఎక్కడ ?

- ఎఎంసిల చుట్టూ తిరుగుతున్న రైతులు
- నెలల తరబడి రైతుల వద్దే పంట
- అప్పులు తీర్చేందుకు దళారులను ఆశ్రయిస్తున్న వైనం



నందిగామలో ధర లేక ఆరబోసిన పత్తి

ప్రజాశక్తి-నందిగామ

మొంథా తుపాను ధాటికి అరకొర మిగిలిన పంటను విక్రయించాలనుకున్న రైతులు ప్రభుత్వాల తీరుతో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వ్యవసాయ కమిటీల ఆవరణలోనే అపరాలు, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు అమ్ముడుపోని పరిస్థితి నెలకొంది. పంటను వ్యవసాయ మార్కెట్ కమిటీకి తీసుకొచ్చిన రైతులు నెలల తరబడి తిరుగుతున్నా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో అధిక శాతం మంది రైతులు అపరాలు సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్లో ఈ రెండు మండలాల్లో ఏడు వేల హెక్టార్లలో కంది, మినుము, పెసరతో పాటు మొక్కజొన్న సాగు చేశారు. కంచికచర్ల మండలంలో మొక్కజొన్న, కంది 180 హెక్టార్లలో, మొక్కజొన్న 100 హెక్టార్లలో, 100 హెక్టార్లలో మినుము, 600 హెకార్లలో కంది సాగు చేశారు. వీరులపాడు మండలంలో 2,240 హెక్టార్లలో మొక్కజొన్న, 220 హెక్టార్లలో మినుము సాగు చేశారు.

దళారులను ఆశ్రయిస్తున్న రైతులు

వ్యవసాయ మార్కెట్ కమిటీలతో పాటు ఆయా గ్రామాల్లోని సొసైటీల ద్వారా రైతులు సాగు చేసిన ఆపరాల పంటలను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీలతో పాటు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేయకపోవడంతో రైతులు చేసేది లేక దళారులను ఆశ్రయించి అయిన కాడికి తెగనమ్ముకుంటున్నారు. మొక్కకొన్న క్వింటాకు రూ.2,400, (మిగతా 2లో)



ప్రజాదర్బార్‌లో అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గ టీడీపి కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి వారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ, పింఛన్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అర్జీలను వెంటనే ఆన్లైన్ చేసి వాటిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల కాలనీల్లో సరైన మౌలిక వసతులు లేక లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని, అలాంటి వాటిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించిందన్నారు. గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు అందిస్తున్నామని, అందుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధం (మిగతా 2లో)



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గుడివాడలో భారీ అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలోని రావి టెక్స్‌టైల్ సమీపంలో అద్దేపల్లి కాంప్లెక్స్‌లోని వాణిజ్య దుకాణాల సముదాయంలో భారీగా మంటలు చెలరేగాయి. తొలుత సెల్‌ఫోన్ దుకాణంలో వచ్చిన మంటలు క్రమంగా మిగతా షాపులకు వ్యాపించాయి. ఇదే కాంప్లెక్స్‌లో జూనియర్ కళాశాల, ఎస్‌బిఐ శాఖలు ఉన్నాయి. ఉయ్యూరు, హనుమాన్ జంక్షన్, పరిసర ప్రాంతాల నుండి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టమూ జరగలేదు. సుమారు రూ.కోటి ఆస్తి నష్టం జరిగినట్లు జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి ఆంజనేయులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. ప్రభుత్వపరంగా వచ్చే సహాయం వెంటనే బాధితులకు అందేలా చర్యలు తీసుకుంటమన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

త్వరలో టిడ్కో గృహాలు కేటాయింపు

- మొదటి ఫేజ్ కింద జక్కంపూడి వద్ద 1104 గృహాలు
- యుద్ధప్రాతిపదికన మౌలిక సదుపాయాలు
- టిడ్కో ప్రాజెక్టు ఆఫీసర్ చిన్నోడు





ప్రజాశక్తి-విజయవాడ

వివిధ దశల్లో ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయిస్తామని టిడ్కో ప్రాజెక్టు ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.చిన్నోడు తెలిపారు. ఇప్పటికే విజయవాడ రూరల్ జక్కంపూడి వద్ద ఉన్న టిడ్కో గృహాల్లో కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని గృహాలకు మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించి, వాటిని పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. జక్కంపూడి వద్ద ఉన్న టిడ్కో గృహాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో టిడ్కో గృహాల నిర్మాణాలు, కేటాయింపులపై 'ప్రజాశక్తి' ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: ఉమ్మడి కృష్ణాజిల్లాలో టిడ్కో గృహ నిర్మాణాలు, వాటి తీరును వివరించగలరు?

జవాబు: ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో టిడ్కో గృహాల నిర్మాణాలను వీలయినంత త్వరగా పూర్తి చేసి, సదరు లబ్ధిదారులకు కేటాయించడమే లక్ష్యంగా పని చేయడం జరుగుతుంది. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలోని విజయవాడ, బందర్ కార్పొరేషన్ల పరిధిలో గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, మిగిలిన మునిసిపాలిటీల్లో కూడా వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయి.

ప్రశ్న: జక్కంపూడిలో ఎన్ని గృహాలను కేటాయిస్తారు?

జవాబు: జక్కంపూడి వద్ద 6,576 టిడ్కో గృహాలకు నిర్మాణాలు పూర్తి అయిన 1104 గృహాలను లబ్ధిదారులకు కేటాయించడానికి, పలు ఏజెన్సీలకు పనులు అప్పగించి, యుద్ద ప్రాతిపదికన చేయించడం జరుగుతుంది.

ప్రశ్న: ఏఏ పనులు జరుగుతున్నాయి?

జవాబు: గృహాలను లబ్ధిదారులకు కేటాయించడానికి ముందే జక్కంపూడి వద్ద అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా అంతర్గత రహదారులు, మంచినీటి పైప్‌లైన్లు, వీధి దీపాలు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ (ఎస్‌టిపిలు), మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు తదితర వివిధ (మిగతా 2లో)

లోపలి పేజీల్లో

శాతవాహన కళాశాల పరిరక్షణకు ఉద్యమం

ఎంబి స్టేడియంలో ప్రైవేటు కార్యక్రమాలొద్దు

ఎంబి స్టేడియంలో ప్రైవేటు కార్యక్రమాలొద్దు

క్రీడాకారులు, వాకర్లు, యువకులు నిరసన

ప్రజాశక్తి-విజయవాడ

సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియాన్ని ప్రైవేటు కార్యక్రమాలు నిర్వహించకుండా ప్రజలకు, క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని కోరుతూ మాకినేని బసవపున్నయ్య అభివృద్ధి కమిటీ క్రీడాకారులు, వాకర్లు, స్థానికుల ఆధ్వర్యంలో స్టేడియం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ విజయవాడ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎస్‌కె నిజాముద్దీన్ మాట్లాడుతూ సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియాన్ని ప్రజోపయోగంగా అన్ని రకాల క్రీడలను నిర్వహిస్తూ, క్రీడాకారులకు ఉపయోగపడే రీతిలో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో విజయవాడ నగరపాలక సంస్థ పాలకవర్గం ఈ స్టేడియాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించడానికి విధానాలు రూపొందిస్తుందన్నారు. స్టేడియాన్ని ఒక వ్యాపార సరుకుగా తయారు చేసి, రాబడే ప్రధానం అన్నట్లు ప్రైవేట్ కార్యక్రమాలకు ఇస్తూ, క్రీడలకు అనుకూలంగా లేకుండా చేస్తున్నారని అన్నారు. స్టేడియం పర్యవేక్షణను పూర్తిగా విస్మరించారన్నారు. ప్రస్తుతం వాకర్లు, క్రీడాకారులు రోజుకు వెయ్యి నుంచి మూడు వేల మంది వరకు ఉపయోగించుకుంటున్నారని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి స్టేడియాన్ని ప్రైవేటీకరించే విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ సెంట్రల్ సిటీ అధ్యక్షులు శివలింగేశ్వరరావు, నగర నాయకులు ఎస్‌కె పీరుసాహెబ్, నాయకులు ఎస్‌కె రసూల్, ఎస్ మల్లేశ్వరరావు, శ్యామ్, శ్రీను, సునీల్, భాస్కర్, ఆనంద్, షకీర్, క్రాంతి, చక్రి, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



స్టేడియం ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న క్రీడాకారులు, వాకర్లు, యువకులు

మొదటిపేజీ తరువాయి

మద్దతు ధర ఎక్కడ ?

పెసలు రూ.965, మినుము రూ.7,800 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు లేకపోవడంతో దాన్ని ఆసరాగా చేసుకున్న దళారులు మొక్కజొన్న క్వింటాకు రూ.1900, పెసలు, మినుము రూ.4 వేలకు మించి కొనడం లేదని రైతులు వాపోతున్నారు. పంటను నెలల తరబడి నిల్వ ఉంచడంతో తెచ్చిన అప్పులు తీరడంలేదని, అందుకే అయినకాడికి అమ్ముకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అట్టహాసంగా సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి నెలలు గడుస్తోంది. సిసిఐ బయ్యర్ కనీసం కొనుగోలు కేంద్రానికి కూడా రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో క్వింటా పత్తిని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అపరాలు, పత్తి పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి నుంచి ప్రకాశం వరకు, అదేవిధంగా నెల్లూరు జిల్లా నుంచి కర్నూలు జిల్లా ప్రాంతాలతో మూడు ఎకనామిక్ జోన్లు ఏర్పాటు చేసి అన్ని విధాలుగా అభివద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. ఈ క్రమంలో మచిలీపట్నంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మైరా, పోస్ట్ కార్డు అనే సంస్థలు పెట్టుబడులు పెట్టి అభివద్ధి చేసేందుకు ముందుకొస్తున్నాయని, అదే విధంగా షిప్పుల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి గోవా ప్రభుత్వ ప్రైవేటు, డిల్లీ, ఇతర దేశాల నుంచి నాలుగు సంస్థలు రానున్నాయని వివరిస్తూ, త్వరలో వారికి అవసరమైన భూములను కేటాయించి పనులను ప్రారంభిస్తామని తెలిపారు. దీని ద్వారా ఈ ప్రాంతంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించనుందన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ లంకె నారాయణ ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, టిడిపి పట్టణ కార్యదర్శి బచ్చుల అనీల్, నాయకులు మధుసూదనరావు, సోమశేఖర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

త్వరలో టిడ్కో గృహాలు కేటాయింపు

అభివృద్ధి పనులు కోట్లాది రూపాయలతో చేయించడం జరుగుతుంది.

ప్రశ్న: జక్కంపూడి వద్ద వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఎప్పటిలోపు పూర్తి చేస్తారు?

జవాబు: నిధుల లభ్యత ఆధారంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, వచ్చే మే, జూన్ నాటికి కంప్లీట్ చేయడం జరుగుతుంది.

ప్రశ్న: మచిలీపట్నం వద్ద ఎన్ని గృహాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి?

జవాబు: మచిలీపట్నంనకు సంబంధించి రుద్రవరం సైట్‌లో వివిధ దశల్లో ఉన్న 1008 గృహాల నిర్మాణాలు జరుగుతున్నాయి. బ్లాక్‌కు 48 గృహాల చొప్పున ఇక్కడ 21 బ్లాక్‌లున్నాయి.

ప్రశ్న: ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఏ దశలో ఉన్నాయి?

జవాబు: రెండు జిల్లాల పరిధిలో మునిసిపాలిటీల వారీగా...జగ్గయ్యపేట మునిసిపాలిటీలో 3,168 గృహాలు, నందిగామ 240, తిరువూరు 1536, ఉయ్యూరు 2496, నూజివీడు 2,640 గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

ప్రశ్న: గృహాల యూనిట్ కాస్ట్ ఎంత?

జవాబు: ప్రభుత్వం నిర్ణయించిన దాని ప్రకారం ప్రతి యూనిట్ కాస్ట్ రూ. ఎనిమిది లక్షల 65 వేలు ఉంది. వీటిల్లో డబుల్ బెడ్ రూమ్, సింగిల్ బెడ్ రూమ్ ప్రకారం ఇళ్ల నిర్మాణం ఉంది. 430 ఎస్‌ఎఫ్‌టి, 365 ఎస్‌ఎఫ్‌టి, అలాగే 300 ఎస్‌ఎఫ్‌టి చొప్పున ఇళ్ల నిర్మాణాలుంటాయి. ఇళ్ల విస్తీర్ణాన్ని బట్టి ప్రతి యూనిట్ కాస్ట్ రూ.8.65 లక్షలు, రూ.7.65 లక్షలు, రూ.6.65 లక్షలు ఉంటుంది. జక్కంపూడి వద్ద 430 ఎస్‌ఎఫ్‌టి విస్తీర్ణం కల్గిన గృహాలు 18 బ్లాక్‌లున్నాయి.

శాతవాహన కళాశాల పరిరక్షణకు ఉద్యమం

విజయవాడ: శాతవాహన కళాశాల ఆవరణలో ఆదివారం కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కళాశాల మాజీ ప్రిన్సిపల్ ఉయ్యూరి సాంబిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ శాతవాహన కళాశాల ఐదు దశాబ్దాల పాటు విద్యా సేవలందించిందన్నారు. కళాశాల స్థలం వాల్యూ కొన్ని కోట్లకు పెరగడంతో కొంతమంది వ్యక్తులు ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. శాతవాహన కళాశాల దురాక్రమణదారుల చేతుల్లో నలిగిపోతుందని, దానిని కాపాడు కోవలసిన బాధ్యత శాతవాహన కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం మీద ఉందని అన్నారు. ఇందుకోసం కోసం అన్ని విద్యార్థి సంఘాలతో పాటు ఐక్య కార్యాచరణ రూపొందించి ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. దుర్గా మల్లేశ్వరి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు పిన్నమనేని కృష్ణమోహన్ మాట్లాడుతూ శాతవాహన కళాశాల పరిరక్షించుకోవడానికి, పూర్వస్థితికి తీసుకు రావడానికి తమ కమిటీ అన్ని విధాలా కృషి చేస్తుందని తెలిపారు. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్ర మాట్లాడుతూ కళాశాల పరిరక్షణకు అన్ని విద్యార్థి సంఘాల తోటి ఐక్య కార్యాచరణ కార్యక్రమం రూపొందించాలన్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షులు నవనీతం సాంబశివరావు మాట్లాడుతూ కళాశాల పరిరక్షణకు పూర్వ విద్యార్థుల సంఘం ముందుండి అన్ని విద్యార్థి సంఘాల సహకారంతో పోరాడుతుందని తెలిపారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ కళాశాల భవనాలు కూల్చడం క్రీడా మైదానాన్ని జెసిబిలతో తవ్వించడం వంటి దుశ్చర్యలు అనాగరికమని, ఈ చర్యలకు పాల్పడుతున్న దుష్ట శక్తుల్ని దురాక్రమణదారుల్ని కార్మిక విద్యార్థి సంఘాలు సమిష్టిగా అడ్డుకుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు రవి, కిరణ్, వెంకన్న, వాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

ప్రజాశక్తి-విజయవాడ

అనుమతి లేని భవన నిర్మాణాలు తొలగిస్తామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఆదివారం ఉదయం చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్న కుమార్ సూచనల మేరకు, కార్పొరేషన్ పరిధిలోని ఉన్న అనధికార నిర్మాణాలపై చర్యలు చేపట్టారు. ఈ ప్రక్రియలో న్యూ ఆర్‌టీసి కాలనీలో ఉన్న అనధికార నిర్మాణాలను గుర్తించి బిల్డింగ్ ఇన్స్పెక్టర్ రాజ్ కమల్ తొలగింపు చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ సందర్భంలో కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏవైనా అనధికార నిర్మాణాలు లేదా భవన మార్పులు అనుమతులు లేకుండా చేపడితే, వాటిపై తక్షణ చర్యలు తీసుకోబడతాయని, టౌన్ ప్లానింగ్ బృందం నిరంతర పరిశీలన చేపట్టి, అనధికార నిర్మాణాలను గుర్తించి తొలగించే కార్యక్రమం కొనసాగిస్తోందిని, కావున నగర ప్రజలు తమ నిర్మాణాలు అనుమతులతోనే చేపట్టవలెనని, లేనిపక్షంలో విధినిర్వహణ చర్యలు తప్పవని తెలిపారు.

నేడు నరసాపురం-చెన్నై వందేభారత్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: దక్షిణ మధ్య రైల్వే వందేభారత్ ప్రయాణికులకు మరో గుడ్‌న్యూస్ చెప్పింది. ఇప్పటివరకూ విజయవాడ-విశాఖ మార్గంలోనే పరుగులు తీస్తున్న వందేభారత్ తొలిసారిగా కోనసీమ నుంచి పరుగులు తీయబోతోంది. ఈ 15న సోమవారం కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఈ రైలును ప్రారంభిస్తారని దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. చెన్నై నుంచి విజయవాడ వరకూ ప్రస్తుతం నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం నుంచి నరసాపురం వరకూ నడిచేలా మార్పు చేశారు. దీంతో నరసాపురం నుంచి చెన్నైకు ప్రయాణించే వందే భారత్ రైలును కేంద్రమంత్రి మధ్యాహ్నం 1.30కు ప్రారంభిస్తారు. నరసాపురం నుంచి బయలుదేరిన తర్వాత భీమవరం టౌన్, గుడివాడ స్టేషన్లలో ఈ రైలుకు కొత్తగా హాల్ట్‌లు ఇచ్చారు. అలాగే చెన్నై నుంచి నరసాపురానికి వచ్చే రైలు కూడా ఈ స్టేషన్లలో ఆగనుంది. నరసాపురం-చెన్నై వందేభారత్ రైలుకు జనవరి 11 వరకూ తాత్కాలిక షెడ్యూల్ ఇచ్చారు. అనంతరం కొత్త షెడ్యూల్ ఇస్తారు. దాని ప్రకారమే ఈ రైలు నరసాపురం నుంచి చెన్నైకు ప్రయాణించబోతోంది. తాజా మార్పుల ప్రకారం ఈ రైలు నరసాపూర్-చెన్నై మధ్య 655 కి.మీ దూరాన్ని కేవలం తొమ్మిది గంటల్లోనే ప్రయాణిస్తుంది. తాత్కాలిక షెడ్యూల్ ప్రకారం నరసాపురంలో మధ్యాహ్నం 2.50కి బయలుదేరి, భీమవరంలో 3.19కి, గుడివాడలో 4.04కి, విజయవాడలో 4.50కి, తెనాలిలో 5.19కి, ఒంగోలులో 6.29కి , నెల్లూరులో 7.39కి, రేణిగుంటలో 9.50కి ఆగుతుంది. చివరిగా 11.45కు చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు చేరుతుంది. తిరిగి చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30కి బయలుదేరి రేణిగుంటలో 7.05కి , నెల్లూరులో 8.39కి, ఒంగోలులో 10.09కి, తెనాలిలో 11.21కి, విజయవాడలో 11.45కి, గుడివాడలో 12.28కి , భీమవరంలో 1.15కి ఆగుతుంది. చివరిగా నరసాపురానికి 2.10కి చేరుకుంటుంది.

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భవానీలు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ నాల్గో రోజుకు చేరుకుంది. ఆదివారం కావడంతో భవానీల సంఖ్య గణనీయంగా పెరిగింది. సుమారు 1.50 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం ఉదయం 3:30 గంటల నుంచే అమ్మవారి దర్శనాలు ప్రారంభమయ్యాయి. భవానీ దీక్షల విరమణ ఉండటంతో అంతరాలయ దర్శనాలను దేవస్థానం రద్దు చేసింది. అలాగే అన్ని ఆర్జిత సేవలు, టికెట్ దర్శనాలను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. భవానీ దీక్షదారులకు ఐదు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా ఉచిత దర్శనానికి అనుమతి ఇచ్చారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.రామచంద్ర మోహన్ దుర్గగుడిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దీక్ష విరమణలో భవానీలకు కల్పిస్తున్న సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది సుమారు ఐదు లక్షల మందికి పైగా భవానీలు దుర్గమ్మను దర్శించుకుంటారని అంచనా వేసినట్లు తెలిపారు. మూడో రోజు మొత్తం 1.30 లక్షల మంది భవానీలు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. 60 వేల లడ్డూలు అమ్మకాలు జరగగా, 36 వేల మంది అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే 10,813 మంది అమ్మవారికి తలనీలాలు సమర్పించారు. భవానీల



భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసర ప్రాంతాల్లో 320 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. కొండ దిగువన ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం మొత్తం 28 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 15వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసంప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం జరుగుతుందన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. మీకోసం ,ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకో వడంతో పాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు.



చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పామర్రు : మండల పరిధి ఉంద్రపూడి గ్రామంలోని మెరుగు అరవిందకు 20 వేల రూపాయల సీఎంఆర్ ఎఫ్ నగదు చెక్కును ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదివారం తన చేతుల మీదుగా లబ్ధిదారిని గృహానికి వెళ్లి అందించారు. అనంతరం అదే గ్రామంలోని బూరగడ్డ వెంకటకృష్ణ ప్రమాదవశాత్తు గాయపడి శాస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను ఎమ్మెల్యే కుమార్ రాజా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఉండపూడి దేవాలయం చైర్మన్ తాడిశెట్టి వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ యాడ్ మాజీ చైర్మన్ మండపాక శంకర్ బాబు, గ్రామ మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తటుకూరి రమణ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గురుమూర్తి 60వ జన్మదిన వేడుకలలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్, కొనకళ్ళ బుల్లయ్య, మండల టిడిపి అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్, మాజీ తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కుటుంబయ్య ప్రముఖులు వేడుకలకు హాజరై గురుమూర్తికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 40 మందికి పైగా రక్తదానం చేశారు. ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్ కామినేని హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం, శ్రీకాంత్ హాస్పిటల్ డయాబెటిస్ వారు, చర్మవ్యాధుల, నరాల చికిత్సల వారు కంటి హాస్పటల్ వారు ఉచిత మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రోగులను ఉచితంగా పరీక్షించి మందులను కళ్ళజోళ్లను అందించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త నూకల వెంకట సాంబశివరావు, వల్లూరు కిరణ్, ఉప్పులూరి గోపాలకష్ణ, కళ్ళం వంశీకష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

గంజాయి వినియోగంపై ఉక్కుపాదం : డిఎస్‌పి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గంజాయి వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నామని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. గుడ్లవల్లేరు పోలీస్‌స్టే షన్‌ను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గంజాయితో దొరికిన 30మంది నిందితులపై మూడు కేసులను నమోదు చేశామన్నారు. కాలేజీలు, పాఠశాలల్లో సైతం మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించేందుకు విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. వైజాగ్, అరకు వంటి ప్రాంతాల్లో వలె మన గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి వినియోగం అంతగా లేదన్నారు. అలాంటి వినియోగం ఉంటే తమ దష్టికి వచ్చిన వెంటనే చర్యలు కఠినంగా ఉంటుందన్నాయని పేర్కొన్నారు. పామర్రులో 50 బైక్‌లను చోరీ చేసిన నిందితుల్ని పట్టుకున్నట్లు తెలిపారు. గుడివాడ టౌన్‌లో ట్రాఫిక్‌ను అదుపులోకి తెచ్చామన్నారు. ప్రజలతో మమేకమయ్యే ఫ్రెండ్లీ పోలీస్‌గా సిబ్బందిని తయారు చేసినట్లు పేర్కొన్నారు. గుడివాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావు, గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

హెల్మెట్‌ధారణతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణరక్షణ : డీఎస్పీ

వాహన చోదకులు హెల్మెట్‌ను ధరించటం వలన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవచ్చునని





గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. ఆదివారం కౌతవరం నుంచి గుడ్లవ ల్లేరు వరకు ఆయన హెల్మెట్ ధారణతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ రక్షణపై అవగాహన కలిగించే బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్ర మంలో గుడివాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.ఎల్. ఆర్. సోమేశ్వరరావు, గుడ్లవల్లేరు ఎస్.ఐ ఎన్.వి.వి. సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



350 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం మద్దూరు గ్రామంలో ఉన్న అంబేద్కర్ కాలనీలో ధనేకుల ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ వారి సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ సెక్రెటరీ లయన్. ఇంజనీర్. రావి. సురేష్ బాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంను నిర్వహించారు. ఈశిబిరాన్ని పెనమలూరు నియోజకవర్గం టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ పాల్గొని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 350కి పైగా ప్రజలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికిఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో పొనుగుమాటి. ఆంజనేయులుకి పాలు, కూరగాయలు, నిత్యావసర సరుకులు, ఆరు వేలు రూపాయలు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ సెక్రెటరీ రావి సురేష్ బాబు మాట్లాడుతూ వందకి పైగా గ్రామాలలో 135కి పైగా ఉచిత మెడికల్ క్యాంపులు, నిర్వహించి ఉచితంగా మందులు,కళ్ళ ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రావి. సాంబశివరావు, రావి. సుబ్బారావు, యనమదల మోహన్, యనమదల. వెంకటేశ్వరరావు, పిళ్ళా. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం : మెరైన్ ఎస్ఐ

ప్రజాశక్తి-కోడూరు : హంసలదీవి సముద్రతీరంలో పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యతనిస్తున్నామని పాలకాయతిప్ప మెరైన్ ఎస్ఐ పూర్ణమాధురి తెలిపారు. ఆదివారం హంసలదీవి బీచ్ వద్దకు విజయవాడ, విజయనగరం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పర్యటకులు ప్రైవేట్ వాహనాలతో విచ్చేశారు. కుటుంబ సమేతంగా స్నానాలు చేసి సముద్ర



పర్యాటకులకు సూచనలిస్తున్న మెరైన్ ఎస్ఐ

తీరం వెంబడి సరదాగా గడిపారు. సముద్ర తీరంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు.



దేవస్థానాల బోర్డు సభ్యులకు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ప్రముఖ దేవస్థా నాలైన శ్రీలంకమ్మ అమ్మవారి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలకు జనసేన కార్యకర్తలైన కోసూరు అవినాష్, శివ పార్వతి లను దేవస్థానం బోర్డు మెంబర్లుగా నియమించినందున వారి ఇరువురిని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ సత్కరించారు. ఆదివారం వారిరువురి స్వగృహాలకు వెళ్లిన జనసేన నాయకులు వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. దేవస్థానం అభివద్ధికి, మన్ననలు పొందాలని వారికి సూచించారు. వీరికి దేవస్థానం సభ్యులుగా అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, యువ నాయకులు మండలి వెంకట్‌రామ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, పి టి సి సభ్యులు బొప్పన భాను, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ బచ్చు కష్ణకుమారి, పార్టీ సీనియర్ నాయకులు చిన్నగిరి సత్యనారాయణ, పప్పు శెట్టి శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, పార్టీ మండల ఉపాధ్యక్షులు తుంగల నరేష్,పాల్గొన్నారు.

కెకెఆర్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడివాడ : ఈ నెల 5, 14 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించిన 63వ నేషనల్ రోలర్, హాకీ, స్కేటింగ్ పోటీలలో డా॥కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచారని స్కూల్ ప్రిన్సిపల్ ఎం.సత్యారామ్, పి.లక్ష్మీప్రసాద్, కె.జ్యోతి, ప్రశాంతిలు తెలిపారు. ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డులోని గౌతమ్ స్కూల్‌లో విద్యార్థులను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా॥కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు ఈ పోటీలలో పి.కారుణ్య, వి.చేతనకృష్ణ, బి.ప్రవర్షిణి రామరాజ్, బహుమతి సాధించినట్లు తెలిపారు.

జర్నలిస్టు దుగ్గిరాల ప్రభాకర్ మృతి



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు/గుడివాడ : మండలంలోని అంగలూరుకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, సిటీ కేబుల్ రిపోర్టర్, కోస్తా జ్యోతి ఎడిటర్ దుగ్గిరాల ప్రభాకం ్(64)(కోస్తా ప్రభాకర్) మృతిచెందారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన విజయ వాడ మణిపాల్ హాస్పిటల్‌లో అనారో గ్యంతో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారని ఆయన సోదరుడు, చంద్రాల పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని గుడివాడ పాటిమీద చందన రెసిడెన్సీలోని ఆయన స్వగృహంలో సోమవారం ఉదయం 8 గంటల వరకు బంధుమిత్రులు, అభిమా నుల సందర్శనార్థం ఉంచుతారన్నారు. ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు ఆయన అంతిమయాత్ర స్వగృహం నుంచి బయలుదేరునని చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్ ప్రభాకర్ 40ఏళ్లగా జర్నలిజం వత్తిలో కొనసాగారన్నారు. గుడివాడలోని ప్రముఖులు, ప్రజలకు ప్రభాకర్ సుపరిచితులేనని అన్నారు. సిటీ కేబుల్‌లో దీర్ఘకాలం పని చేసి సిటీ కేబుల్ ప్రభాకర్‌గా పేరు గాంచారన్నారు. ఆయన కోస్తాజ్యోతి అను సాయంకాల దినప త్రికను స్థాపించి పలువురు మన్ననలు పొందారన్నారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



పవన్‌కు పలువురి నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మల్లయ్య స్వీట్స్ అధినేత వెంకటేశ్వరరావు కుమారుడు న్యాయవాది జోసఫ్ పవన్ చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జోడుగుల దేవస్థాన చైర్మన్ దేవనూరి వీరబాబు, మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు, కూటమి నాయకులు శేఖర్, పద్వి, కొలపల్లి గణేష్ పాల్గొన్నారు

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ ఉచిత నేత్ర పరీక్షా శిబిరంలో డాక్టర్ మోహనరావు 69 మంది రోగులను పరీక్షించి, అందులో 27 మందికి ఐఓఎల్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. నేత్ర శాస్త్ర చికిత్సకు గుర్తించిన వారికి డిసెంబరు 15, 16 తేదీల్లో విజయవాడ అమరా వతి కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహించనున్నారు. అమరావతి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వేణుచే ఈ శిబిరం నిర్వహించారు. ఇందులో బీపీ, షుగరు వ్యాధితో బాధపడుతున్న 49 మందికి కంటి నరముల బలహీనతలు పరీక్షించారు. వాసవీ క్లబ్ కార్యదర్శి గోళ్ల వెంకటరత్నం, కోశాధికారి జూపూడి కిరణ్, దింటకుర్తి జ్యోతి, వరదా రాజశేఖర్, యండూరి లక్ష్మీప్రసాద్, గోళ్ల ద్రోణపూర్ణచంద్రరావు, మలిశెట్టి చెంచురామ ఎలు, రాధాకష్ణ, గణపతి తదితరులు శిబిరాన్ని పర్యవేక్షించి సేవలు అందించారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



ప్రజాశక్తి-విజయవాడ : స్థానిక బిఆర్‌టిఎస్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో పలు డివిజన్‌లకు చెందిన అనారోగ్యంతో బాధపడి ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్న బాధితులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావు సిఎం సహాయనిధి కింద రూ.6. 11 లక్షల (సిఎంఆర్‌ఎఫ్) చెక్కులను ఆదివారం బాధితులకు అందజేశారుఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ అనారోగ్యానికి గురై వైద్యం చేపించుకొన్నవారిని ఆర్థికంగా ఆదుకునేందుకు సెంట్రల్ నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న వారి అందరికీ సీఎం సహాయ నిధి నుండి పెద్ద మొత్తంలో చెక్కులను ఇస్తూ వారిని ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలను, కార్పొరేషన్ పరంగా ఉన్న వైద్యశాలలను అభివద్ధి చేసి అందరికీ ఆరోగ్యకరమైన మంచి వైద్యాన్ని అందించెందుకు కషి చేస్తున్నామన్నారు.

భవానీలకు ప్రసాదం వితరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురంలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భవానీలకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.. స్తానిక నాలుగు స్తంభాల సెంటర్‌లో నాగేంద్ర స్వామి బాల భక్త సమాజం ప్రతినిధి బడుగు గణేష్ గౌడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరి ప్రదక్షణ చేస్తున్న భవానీ భక్తులకు అన్న ప్రసాదాన్ని అంద చేశారు..కార్యక్రమంలో బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, 44 వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు ,స్థానిక కార్పొరేటర్ నరేంద్ర రాఘవ తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో కెపి రావు కృషి మరువలేనిది : లగడపాటి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : క్రీడా రంగంలో, ముఖ్యంగా కబడ్డీలో సీనియర్ క్రీడా నిర్వాహకులు కె.పి.రావు చేసిన కషి మరువలేనిదని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ అన్నారు. క్రీడా రంగంలో, ముఖ్యంగా కబడ్డీలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సీనియర్ క్రీడా నిర్వాహకులు కె.పి.రావు స్వర్ణ జయంతి వేడుకను విజయవాడలోని ఎన్‌ఏసీ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ ఒలింపిక్స్ మాజీ కౌన్సిల్ సభ్యులు నరేంద్ర ధ్రువ్ బత్రా, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ సహా పలువురు ముఖ్య అతిథులు హాజరై కె.పి.రావును సత్కరించారు. ఈ సందర్భంగా లగడపాటి మాట్లాడుతూ కేపీ రావు కబడ్డీకి చేసిన సేవలను కొనియాడారు. సన్మానం అనంతరం కె. పి.రావు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు ఉపయోగపడతానని హామీ ఇచ్చారు.

ఎఐ సిరీస్ ఎయిర్ కండీషనర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వరుసగా 16 ఏళ్లు నెంబర్ వన్ అప్లయన్సెస్ బ్రాండ్‌గా పేరుతెచ్చుకున్న హైయర్ అప్లయెన్సెస్ ఎఐ ఫర్ ఎయిర్' కార్యక్రమంలో తన అద్భుతమైన గ్రావిటీ ఏఐ సిరీస్ ఎయిర్ కండిషనర్‌లను ఆవిష్కరించిందని హైయర్ అప్లయన్సెస్ ఇండియా ప్రాంతీయ ప్రతినిధి ఎన్ ఎస్ సతీష్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సరికొత్త లైనప్ ఏఐ ఎట్మాక్స్ ద్వారా మరింత శక్తిని పొందుతుందని తెలిపారు. ఇది ఇప్పటి వరకు బ్రాండ్ యొక్క అత్యంత ప్రీమియం, ఏఐ ఇంటిగ్రేటెడ్ ఏసీ సిరీస్‌గా పేరు తెచ్చుకుందన్నారు. ఏఐ ఎట్మాక్స్ పవర్ మేనేజర్‌తో పొదుపు, ఏఐ ఎట్మాక్స్ న్యూరోతో సౌకర్యం, ఏఐ ఎట్మాక్స్ ఆటో క్లీన్‌తో సేవ కోసం భారతీయ గృహాలకు ఎయిర్ కండిషనింగ్‌ను స్మార్ట్‌గా, మరింత సమర్థవంతంగా సులభంగా మారుస్తుందని తెలిపారు. కొత్త హైయర్ గ్రావిటీ ఏఐ సిరీస్ ఏసీలు తదుపరి తరం లక్షణాల యొక్క శక్తివంతమైన సూట్‌ను అందిస్తాయని వెల్లడించారు.

భువనశ్రీ అరంగేట్రం అదరహో



విజయవాడ : స్థానిక విద్యార్థిని.. యువ నత్య కళాకారిణి గోళ్ల భువనశ్రీ కూచిపూడి నత్యంలో అరంగేట్రం అదరగొట్టింది. 'ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్' యువ పురస్కార గ్రహీత, 'కళారత్న' డాక్టర్ చింతా రవి బాలకష్ణ వద్ద నాలుగేళ్లుగా కఠోర శిక్షణ పొంది.. వివిధ నత్యాంశాలతో ఆదివారం శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో చేసిన పరిణితి నత్యాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి. గణపతి స్తుతి (నాటరాగం.. ఆదితాళం), అన్నమాచార్య కీర్తన (మోహనరాగం.. ఆదితాళం), క్షేత్రయ్య పదం (మోహనరాగం.. ఆదితాళం) శివస్తుతి (రాగమాలిక.. ఆదితాళం) తిల్లానా (బందావన సారంగ రాగం.. ఆదితాళం) ఇత్యాది కీర్తనలకు డాక్టర్ చింతా రవి బాలకష్ణ (నట్టువాంగం), సీహెచ్ సుధా శ్రీనివాస్ (గాత్రం), పసుమర్తి హరనాథ శాస్త్రి (మదంగం), పాలపర్తి ఆంజనేయులు (వయోలిన్), ఎస్ కుమార్ బాబు (ఫ్లూట్), ఐ.రాజకుమార్ (మేకప్), టి.అన్నపూర్ణ ప్రసాద్ (దర్జీ), పరిమి భాస్కర శర్మ (లైటింగ్) సహకారంతో కార్యక్రమం ఆద్యంతం రక్తిగట్టింది. ఈ సందర్భంగా గురువులు ఎస్కే ఖలీల్, దేవరకొండ నాగసాయి, రమణి సిద్ధి, ఇందిరా పరశురాంలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ప్రియ శిష్యురాలు భువనశ్రీ అరంగేట్రాన్ని పురస్కరించుకుని రవి బాలకష్ణ మాట్లాడుతూ కూచిపూడి నాట్యం విశ్వవ్యాప్తం కోసం నాట్య గురువుల సేవ వెలకట్టలేనిదన్నారు. కూచిపూడి నాట్య సాంప్రదాయాన్ని గుర్తించిన విదేశీయులు సైతం మక్కువ చూపిస్తున్నారని గుర్తుచేశారు. గురు సాంప్రదాయాన్ని కాపాడుకోవాలని ఆయన హితవు పలికారు. వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు వల్లభ జోష్యుల పవన్ సురేష్ గోళ్ళ శివప్రసాద్ శిరీష తదితరులు భువనశ్రీని అభినందించారు. నిర్వాహకులు నాట్య గురువులకు పూర్ణకుంభంతో స్వాగతం పలకటం విశేషం.



అలరించిన సంగీత సమ్మేళనం

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సజనాత్మకత సాంస్కతిక సమితి సౌజన్యంతో "జేఎన్‌ఎస్ సరాగాలు" సాంస్కతిక సేవా సంస్థ ఆదివారం రాత్రి స్థానిక గాంధీనగర్ వి.హెచ్. గ్రంథాలయంలో 'సంగీత సమ్మేళనం' నిర్వహించింది. మీనా కుమారి, మాధవి, శ్యాంప్రసాద్, సుకన్య, మాధవరావు, సరళ, ఝాన్సీ, రవివర్మ, సుగుణ, బాజీ, వెంకటరమణ, జి.మంగరాజు తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు పాడిన వివిధ పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి. ప్రముఖ అడ్వకేట్ హజరతయ్య గుప్తా, ఎన్.సాంబశివరావు, పి.వెంకన్న, టీవీ నటిమణి సరిత, కే డేవిడ్ రాజు, నాగేంద్ర తదితర అతిథులతో పాటు గాయనీ గాయకులను కార్యక్రమ ప్రధాన సంధానకర్త నడకుదుటి ఝాన్సీ సన్మానించారు.

సిద్ధార్థ ఫిజిక్స్ అధ్యాపకుడు రాజశేఖర్‌కు డాక్టరేట్



విజయవాడ : విజయవాడ పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు రాజశేఖర్ నల్లమోతు సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీహెచ్డీ డిగ్రీ ప్రదానం చేసినట్లు వర్సిటీ రీసెర్చి సెల్ సమన్వయకర్త డాక్టర్ పి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు ఆచార్య వి.రవికుమార్ పర్యవేక్షణలో కోబాల్ట్ ఆక్సైడ్ రసాయన సమ్మేళనాన్ని నిర్దేశిత గ్లాసులలో కలపడం వల్ల ఏర్పడే నిర్మాణ, విద్యుత్ పరిణామాలు, పాజిట్రాన్ నిర్మూలన, మార్పుల అధ్యయనం అనే అంశంపై రాజశేఖర్ సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ డిగ్రీని ప్రకటించడం పట్ల ప్రిన్సిపాల్ డా.మేకా రమేశ్, డీన్ ఆచార్య రాజేశ్ సి.జంపాల, డైరెక్టర్ వేమూరి బాబూరావు, ఫిజిక్స్ విభాగాధిపతి డా.శ్రీనివాసకష్ణ, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం రాజశేఖర్ ను అభినందించింది.

చిన్నారులు తప్పిపోకుండా చైల్డ్ ట్యాగ్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది భవానీ దీక్షా విరమణకు వచ్చే భక్తుల పిల్లలు తప్పిపోకుండా చైల్డ్ మోనిటరింగ్ సిస్టమ్ ట్యాగ్ వేస్తున్నారు . రద్దీ వేళ చిన్నారులు తప్పిపోతే సత్వరం గుర్తించి వారిని తల్లిదండ్రులకు అప్పగించేందుకు ఈ ట్యాగ్ ఉపయోగపడుతుందని శాఖాధికారులు పేర్కొన్నారు. మొత్తం 12 ప్రదేశాలలో 240 సిబ్బంది ట్యాగ్లు వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు లక్ష్మి భార్గవి, కష్ణ కుమారి, భానుమతి, పుష్పలత, సత్యవతి, జోష్నా, డీసీపీవో యమ్. రాజేశ్వరరావు, కిరణ్ కుమార్,



జాన్సన్,దుర్గ ప్రసాద్, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

పిన్నెల్లి అరాచకాలకు జగనే బాధ్యుడు

బుద్దా వెంకన్న



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట రామిరెడ్డి ఇద్దరు నరరూప రాక్షసులైతే, పులివెందుల ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ రెడ్డి మరోరకం రాక్షసుడని, అందుకే వారి అరెస్ట్‌ను రాష్ట్ర ప్రజలందరూ స్వాగతిస్తురని, మాచర్ల నియోజకవర్గ ప్రజలు దీపావళి పండుగ జరుపుకుంటున్నారని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. పిన్నెల్లి సోదరుల అరెస్ట్‌కు సంఘీభావంగా జగన్‌మోహన్‌రెడ్డి కొవ్వత్తుల ప్రదర్శనకు పిలుపునివ్వటాన్ని ఖండిస్తూ ఆదివారం ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిన్నెల్లి సోదరులు మున్సిపల్ ఛైర్మన్ కోసం వేలం పాట పెట్టి దాడులు, హత్యలు చేయించిన దుర్మార్గులు అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో పిన్నెల్లి సోదరులను అరెస్టు చేస్తే... ఇది అక్రమ నిర్భందం అనటం జగన్‌కి చట్టాలపై ఎంతో గౌరవం ఉందో అర్ధమవుతుందన్నారు. రాష్ట్రంలో టీడీపీ మద్దతు దారులను చంపేయాలని లక్ష్యంగా పెట్టుకొని పిన్నెల్లి బ్రదర్స్ వ్యవహరించారన్నారు. తనపై, బొండా ఉమామహేశ్వరరావు దాడి చేయించారన్నారు. జై వైసిపి అనలేదని చంద్రయ్య గొంతు కోసి చంపేశారన్నారు. ఇద్దరు వ్యక్తులను అత్యంత కిరాతకంగా చంపిన వారిని అరెస్టు చేస్తే.. జగన్ సంఘీభావం ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. రౌడీ షీటర్లు, దుర్మార్గులకు అండగా ఉంటూ వారిని కాపాడుతున్న జగన్‌కు, వైసిపికి అడ్రస్ లేకుండా చేయాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



ప్రజాశక్తి-విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్నీ పోలీసు స్టేషన్లు, టాస్క్ ఫోర్స్ కార్యాలయాల్లో అయా పోలీసు అధికారులు వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్ లకు చెడునడత కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని కోరారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గోవడం చేయరాదన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అంతేకాకుండా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : మండలంలోని అన్ని గంటలపాడు గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు ముగిశాయి. ఈ శిబిరంలో సుమారు 1500 మంది రోగులను ఉచితంగా పరీక్షించి కంటి ఆపరేషన్లకు అవసరమైన వారిని ఎంపిక చేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలుని ర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవరం సొసైటీ అధ్యక్షులు కట్ట వెంకట నరసింహారావు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

ధ్యాన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ద్వితీయ ప్రపంచ ధ్యాన దినోత్సవం డిసెంబర్ 21ను పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం శాంతివన్ యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యాన సప్తాహం పేరుతో కొండపల్లి మునిసిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం నుండి ఆదివారం వరకు ఉచిత ధ్యాన అవగాహనా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు శాంతివన్ యోగ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, యోగా గురువు లంకె జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మూలపాడు జిల్లాపరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ధ్యానం అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం కొండపల్లి నాగార్జున ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో అవగాహనా ర్యాలీ, బుధవారం జి కొండూరు శ్రీశ్రీ ఇంగ్లీష్ మీడియం స్కూలు విద్యార్థులతో ధ్యాన సదస్సును, గురువారం మూలపాడులో మహిళా ధ్యానుల కోసం ప్రత్యేకంగా కార్యక్రమం, శుక్రవారం కొండపల్లి క్రాంతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ, శనివారం ఐశ్వర్య గ్రాండ్ కమ్యూనిటీ హాలులో మహిళలతో ఒక ప్రత్యేక ధ్యాన కార్యక్రమం, ఆదివారం ఇబ్రహీంపట్నం, కొండపల్లిలలో ధ్యాన దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కార్మిక నాయకులు మస్తాన్‌కు నివాళి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: మాజీ కార్మిక నాయకులు షేక్ పెద్ద మస్తాన్ మృతదేహాన్ని మాజీ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ సందర్శించి నివాళులు అర్పించారు. మస్తాన్ కార్మిక నాయకుడిగా కార్మికుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, ఆయన మృతి తీరని లోటు అని అన్నారు. మస్తాన్ కుమారుడు జానీ షరీఫ్‌ను పరామర్శించి ఓదార్చారు. మస్తాన్ మృతదేహాన్ని మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, టిడిపి కో-ఆప్షన్ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని సందర్శించి నివాళులర్పించారు.



రంగా ఆశయ సాధనకు కృషి : ఆశాకిరణ్

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : పేద ప్రజల కోసం పోరాడి అశువులు బాసిన ప్రజా నాయకుడు రంగా ఆశయాలే ఊపిరిగా పేదల పక్షాన నిలబడి తండ్రి లక్ష్య సాధన కోసం కృషి చేస్తానని వంగవీటి ఆశకిరణ్ పేర్కొన్నారు. ఆదివారం మచిలీ పట్నం వలందపాలెంలో వంగవీటి రంగా నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మచిలీపట్నం డిప్యూటీ మేయర్ శీలం భారతి, బాబ్జి నేతృ త్వంలో పదిమందితో కూడిన విగ్రహ కమిటీ సభ్యులు కార్యక్రమాల్ని ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం లక్ష్మీ థియేటర్ సెంటర్ నుంచి ర్యాలీగా తరలి వెళ్లి విగ్రహావిష్కరణ చేశారు. ఈ క్రమంలో జ్యోతిబాపూలే తదితర మహనీయుల విగ్రహాలకు ఆశకిరణ్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రంగా అభిమా నులు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రశంస పత్రాలు చూపుతున్న విద్యార్థులు

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పామర్రు : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేటలో ఈనెల 14న జరిగిన జాతీయస్థాయి కరాటే, కుంగ్ ఫు ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలలో మండల పరిధిలోని రాపర్ల గ్రామానికి చెందిన మదర్ తెరిసా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పలు బహుమతులను సాధించారు. వివిధ కేటగిరీలలో పాల్గొన్న విద్యార్థులు వి ఆకాష్, జి సిద్ధార్థ,టి జయవర్ధన్, బి లోహితాస్వా,డి నిహాన్వి, డి శ్రియన్షి, సిహెచ్ జై,ఏ ధ్రువ,టి లలిత లు బంగారు పతకాలను సాధించారు. విజేతలైన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపల్ ఎల్.పుష్ప, కరాటే మాస్టర్ జి. శంకర్‌బాబు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ముగిసిన కూచిపూడి నృత్య శిక్షణ

ప్రజాశక్తి-మొవ్వ : నాట్యక్షేత్రమైన కూచిపూడిలోని శ్రీ సీతారామ ఫంక్షన్ హాల్‌లో నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, డాక్టర్ వేదాంత వెంకట దుర్గా భవానిల ఆధ్వర్యంలో మూడురోజులుగా కూచిపూడి నృత్యంలో నిర్వహిస్తున్న నృత్య శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ శిక్షణ తరగతులలో మోహన కళ్యాణి రాగంలో ఆదితాళంలో రామలింగ శాస్త్రి కొరియోగ్రఫీలో రూపొందించిన "సంగీత సామ్రాజ్య సంచారిణి", కూచిపూడి ప్రార్థన "అంబా పరాకు-దేవీ పరాకు",కూచిపూడి చరిత్ర-పరిక్రమణ" సిద్ధాంతంలపై శిక్షణ నిర్వహించారు. అలాగే సంగీత శిక్షణ కార్యక్రమాన్ని డాక్టర్ వేదాంతం వెంకట దుర్గా భవాని నిర్వహించారు. ముగింపు సందర్భంగా తాము అభ్యసించిన అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముగించే ముగింపు సభలో రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి తరలి వచ్చి శిక్షణ పొందిన 50 మంది విద్యార్థిని



విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. చక్రవర్తుల పవన్ కుమార్ (రాజమండ్రి), నిహారిక చౌదరి (హైదరాబాద్)ల సౌజన్యంతో నిర్వహించిన శిక్షణా తరగతుల ముగింపు సభలో ఏఎంసీ చైర్మన్ దోనెపూడి శివరామయ్య, కూచిపూడి రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు కొండవీటి అమరబాలేశ్వరరావు, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థాన పాలకమండలి ఉపాధ్యక్షులు పసుమర్తి నారాయణమూర్తి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు నాట్యా చార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ వేదాంతం పార్థసారథి పాల్గొన్నారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకుంటే రాయితీ

- గుడివాడ డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరరావు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గృహ వినియో గదారులకు విద్యుత్ శాఖ వారు సువర్ణ అవకాశం ఇచ్చారని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివా సరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వారు ఈ డివిజన్ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదా రులకు రాయితీ ఇచ్చే అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకుందాం అనుకునే గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. సాధారణంగా ఒక కిలో వాట్ లోడు క్రమబద్ధీకరణ కోసం గృహ వినియోగదారులు డెవలప్మెంట్ చార్జీల కింద విద్యుత్ శాఖకు రూ.2వేలు చెల్లించవలసి ఉంటుందన్నారు. కానీ ఇప్పుడు కేవలం రూ.వెయ్యి చెల్లిస్తే సరిపోతుం దన్నారు. కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ఈ అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమేనని తెలిపారు. చెల్లింపులకు ఎ.పి.సి.పి. డి.సి.ఎల్. అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచిన వాలం టరీ అడిషనల్ లోడ్ స్కీం అనే లింక్ ద్వారా గాని లేదా మీ సమీపంలోని విద్యుత్ రెవిన్యూ కార్యాలయంలో కూడా చెల్లించవచ్చునని పేర్కొన్నారు.



కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకు న్నారు. అమ్మవారిని సుమారు 15వేల మంది యాత్రికులు దర్శించుకోగా అత్యధిక స్థాయిలో యాత్రికులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు మరియు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు, దేవస్థాన కార్యనిర్వ హణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షిం చారు. గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగమల్లేశ్వరరావుకు బంగారు పతకాలు

ప్రజాశక్తి -చల్లపల్లి : ఏడవ ఏపీ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం వక్కల గడ్డ గ్రామానికి చెందిన మురాల నాగమల్లేశ్వరరావు 40-45 ఏళ్ల విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాపట్ల ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం ఈ పోటీలు నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న నాగేశ్వరరావు ఐదు కిలోమీటర్ల పరుగుపందెం విభాగం, 1500 మీటర్ల పరుగు విభాగంలో బంగారు పతకాలు సాధించారు. 110 హర్డిల్స్ విభాగంలో వెండి పతకం సాధించారు. విశాఖపట్నంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమల్లేశ్వరరావు, ఆ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వక్కలగడ్డ గ్రామానికి చెందిన నాగమల్లేశ్వరరావు బంగారు పతకాలు సాధించటం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేస్తూ అభినందనలు తెలిపారు.





మంత్రి కొల్లును కలిసిన డిఇఓ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా విద్యాశాఖా ధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన యు వి.సుబ్బారావు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రను ఆదివారం ఆయ న కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా లో విద్యా ప్రమాణాలు మరింత పెంచే విధంగా కృషి చేయాలని, రానున్న పదో తరగతి లో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని మంత్రి, డిఈఓ కి సూచించారు.



ఎంఎల్ఎ బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఎంఎల్‌ఎకు ఎపిపి సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ జిల్లా ఆరవకోర్టు నూతన ఏపీపీగా ఎంపికైన కర్ర సుధాకర్ అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాదును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరిం చారు. ఆదివారం ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ వద్దకు వెళ్లి ఆయనను కలసి కూటమి ప్రభుత్వం తనను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించేలా సిఫారసు చేసిన బుద్ధ ప్రసాద్కు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీపీగా నియమితులైన సందర్భంగా సుధాకర్ను నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రావు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మండలి వెంకట్రాములను సుధాకర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, శ్రీ లంకమ్మ అమ్మవారు, శివాలయం చైర్మన్లు అన్నపురెడ్డి వెంకట స్వామి, ఘంటసాల రాజమోహన్రావు (కన్నయ్య) సర్పంచ్ డెడ్ల జానకి రాంబాబు, ఎంపీటీసీ, తెలుగు యువత రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న), టిడిపి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దిరిశం వెంకట్రావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

దోకిపర్రు ఆలయంలో యాత్రికుల రద్దీ


ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రం భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామి వారిని యాత్రికులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలను మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణ నడుమ వైభవంగా వేద పండితులు నిర్వహించారు. ఈ సంద ర్భంగా భారీ అన్నసమారాధనను నిర్వహించారు. నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ఉన్నారు.



అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

మల్లేశ్వర స్వామి దేవస్థానం పాలకవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నం సర్కిల్ పేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. దేవస్థానం నూతన పాలకవర్గం చైర్మన్గా యక్కల చంద్రశేఖర్ పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మచిలీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర టిడిపి నాయకులు కొనకళ్ళ జగన్నాథరావు ఇలియాస్ బుల్లయ్య పాల్గొని ప్రసంగించారు ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు గొర్రె పాటి గోపీచంద్ మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచెనాని, జనసేన పార్టీ నగరఅధ్యక్షుడు గడ్డం రాజు, బిజెపి నాయకులు పంతం గజేంద్ర, పి వి ఫణి కుమార్ కూటమి నాయకులు పుర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వర దేవస్థానం చైర్మన్ యక్కల చంద్రశేఖర్, నూతన ధర్మకర్తల మండలి సభ్యులను బంధుమిత్రులు శ్రేయోభి లాషులు పుర ప్రముఖులు ఘనంగా సన్మానించారు.



సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- మోపిదేవి : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో సీయోను గాస్పల్ మినిస్ట్రీస్ వారి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సెమీ క్రిస్మస్ వేడుకలు ముఖ్య అతిథులుగా మోపిదేవి మండల జడ్పీటీసీ మల్లికార్జు నరావు, అవనిగడ్డ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ మత్తి శ్రీనివాసరావు, రావి వసంతరావు అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అబ్బూరి నాగరాజు రెండొందల మంది పేదలకు బ్లాంకెట్స్ అందించారు. అనంతరం సెమీ క్రిస్మస్ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. పాస్టర్ కె యోహానుబాబు, హెచ్‌సిఎం డైరెక్టర్ గుంటూరు రాజేష్ పాల్గొన్నారు.

ఎపి ఎన్‌జిఒ అధ్యక్షునిగా దొండపాటి



ప్రజాశక్తి-గంపలగూడెం: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ (తిరువూరు తాలూకా యూనిట్) అధ్యక్షునిగా దొండపాటి అజయ్ కుమార్ ఎన్నికయ్యారు. తిరువూరులో ఇటీవల జరిగిన ఎన్జీవోల ముఖ్య కార్యవర్గ సమావేశంలో ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గాంధీరెడ్డికి సన్మానం

ప్రజాశకి-పెనుగంచిప్రోలు : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం చిట్యాల గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్, ధర్మ ప్రచారకర్త లంకెల గాంధీరెడ్డి దేవాలయంలో ఉపదేశం నిర్వహించారు. అమ్మవారి జీవిత చరిత్ర, భగవద్గీత, తదితర అంశాలపై వచ్చిన భక్తులకు ప్రసంగించారు. ఆలయ పూజారులు గాంధీరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. పలువురు భక్తులు ఆయనను అభినందించారు.



మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా ప్రభాకర్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా మల్లెల సీతమ్మ, వైస్ చైర్మన్‌గా జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామానికి చెందిన అడుసుమల్లి ప్రభాకర్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్‌గా నియమితులైన అడుసుమల్లి ప్రభాకర్ ఆదివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), శ్రీరాం చిన్నబాబులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను అభినందించి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని కూనపరాజు పర్వ, కుదప గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యుటిఎఫ్ సౌజన్యంతో ఎంఎన్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ముప్పిడి నాగేశ్వరరెడ్డి ద్వారా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకొని విజయం సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



ఘనంగా 'గౌతమి' వార్షికోత్సవం

ప్రజాశక్తి- నందిగామ : విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. రైతుపేటలోని శ్రీ గౌతమ హైస్కూల్లో 5వ వార్షికోత్సవ వేడుకల్లో తంగిరాల సౌమ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తల్లి మొదటి గురువు అని ఆ తర్వాత విద్యార్థుల బాధ్యత గురువులైన అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు నేర్పినపాఠ్యాంశాలను చక్కగా అవగాహన చేసుకుని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణవ్వాలని సూచించారు. ఇక్కడ చదువుకున్న చిన్నారులు లాయర్లుగా కలెక్టర్లుగా రాజకీయ నాయకులుగా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే యువతగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి . ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ మండల వరలక్ష్మితో పాటు పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ప్రణీత సాయి, అఖిల్ డైరెక్టర్ సరికొండ రవీంద్రబాబు, లక్ష్మి డైరెక్టర్లు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రైతుల సమస్యలపై సౌమ్యకు శ్రద్ధ లేదు

- మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామలో ఎమ్మెల్యే ఎవరో ఎవరికి తెలియని పరిస్థితి నెలకొందని, ప్రస్తుతం ఎమ్మెల్యే అని చెప్పుకుంటున్న ఆమెకు రైతుల పరిస్థితి, రైతుల ఆవేదన, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కనీసం అవగాహన లేదని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు విమర్శించారు. ఆదివారం నందిగామ వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నందిగామలో పత్తి కొనుగోళ్లపై వైసిపి ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటం మొదలుపెట్టాకే ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ పరిధిలో ప్రభుత్వం రైతుల నుండి మినుములు, పెసలు, అపరాలు కొనలేదన్నారు.నందిగామలో ఎమ్మెల్యేకు - ఎంపికి



ఇసుక అక్రమ రవాణా డబ్బుల్లో వాటాలు పంచుకోవడంలో ఉన్న శ్రద్ధ... రైతుల సమస్యలపై లేదన్నారు. విజయవాడ నగరంలో సోమవారం 16న నిర్వహించనున్న కోటి సంతకాల పత్రాల వాహనాల ర్యాలీకి ప్రజాస్వామ్యవాదులంతా తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు మస్తాన్, కోటేరుసుబ్బారెడ్డి, మల్లిఖార్జునరావు, సురేష్, వెలగపూడి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి-మైలవరం : మైలవరం పెద్ద హరిజనవాడలోని స్మశానవాటికలో పిచ్చి చెట్లు పెరిగి అస్తవ్యస్తంగా ఉంది. స్మశానానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, వర్షాకాలమైతే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో పెద్ద హరిజనవాడ కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నట్లు మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితిష్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన లితీష్ ఎమ్మెల్యే వసంత కష్ణ ప్రసాద్ సూచనల మేరకు ఆదివారం స్మశానంలో ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌సి కాలనీవాసులు లీతీష్‌కు ధన్యవాదాలు తెలిపారు..

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుగున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం హైదరాబాద్ పట్టణానికి చెందిన గోనుగుంట్ల సుశీల రూ.10,116 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా సిబ్బంది శ్రీ స్వామివారి ప్రసాదంలు, శేష వస్త్రాలు అందజేయడం జరిగినదని ఆలయ ధర్మకర్తలు మండల చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి కె సాంబశివరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కీసర కళాశాల సమీపంలో విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ట్రాఫిక్ పోలీసులు అందించిన వివరాల ప్రకారం విజయవాడ నుండి హైదరాబాద్ వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న అదే మార్గంలో ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి ఢీకొనటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న దుర్గా సురేష్ కుమార్ హెల్మెట్ ధరించి ఉండటంతో అతనికి తలకు ఎలాంటి గాయం కాకుండా సురక్షితంగా బయటపడ్డాడు. అయితే, హెల్మెట్ ధరించని మహిళా పిలియన్ రైడర్ రమణ తలకు తీవ్రమైన గాయంకావడంతో ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఐసీయూలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

కంచె తొలగింపు



ప్రజాశక్తి-జి.కొండూరు : మండలంలోని కుంటముక్కల గ్రామానికి చెందిన 15 మంది బడుగు బలహీన వర్గాలకు చెందిన రైతులను తమ పంట పొలాల్లోనికి వెళ్లకుండా గ్రామంలో కొందరు పొలాలకు వెళ్లే దారికి అడ్డుగా వేసిన కంచే (ఫెన్సింగ్ వైర్)ను సిపిఎం నాయకులు రైతులతో కలిసి తొలగించారు. కుంటాముక్కల గ్రామం నుండి మైలవరం వెళ్లే రోడ్డులో ఉన్నా బాడవ పొలాల్లోకి వెళ్లే దారిని మూసివేయడంతో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల ఆంజనేయులు, జి కొండూరు మండల నాయకులు పంది సాంబశివరావు రైతులతో కలిసి ఆదివారం కుంటముక్కలలోని బాడవ ప్రాంతంలో ఉన్న పొలాలను సందర్శించారు. అనంతరం రోడ్డుకు అడ్డంగా వేసిన కాంచేను (ఫెన్సింగ్)ను తొలగించారు. ఈ సందర్భంగా పీవి.వీరాంజనేయులు మాట్లాడుతూ.. పోరంబోకు స్థలంలో ఉన్న ఈ రోడ్డును కొందరు రాజకీయ పెత్తందారులు రోడ్డుకు కంచె అడ్డుగా వేసి రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఈ దారి విషమై ప్రజాదర్బాల్లో రైతులు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. 15 కుటుంబాలకు సంబంధించిన రైతులు నడవడానికి దారి లేక ఇబ్బందులు పడుతూ సమస్యను పరిష్కరించండి అయ్యా అని అర్జీ ఇచ్చి రైతులు వేడుకుంటే అధికారుల చేత ఎమ్మెల్యే పని చేయించలేకపోయారన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ కలగజేసుకొని ఈ దారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం మండల సిపిఎం కార్యదర్శి సిహెచ్ సుధాకర్, రైతు సంఘం నాయకులు సుబ్బారావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో ఎస్.హెచ్.జి మహిళలకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి లో 3వ విడత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ దగ్గర కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్ను బోయిన చిట్టిబాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య జెండా ఊపి బస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో వర్మీ కంపోస్ట్, కుటీర పరిశ్రమ తేనే తయారీపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా ఎస్.హెచ్.జి మహిళలు 45 మంది వెళ్లినట్లు తెలిపారు. మహిళలు స్వయం సమృద్ధి



సాధించే దిశగా వారికి ఈ శిక్షణ కార్యక్రమాన్ని అందించనున్నట్లు తెలియజేశారు. రసాయనిక ఎరువులు వాడకం వల్ల రోగాల బారిన పడాల్సి వస్తుందని, వర్మీ కంపోస్ట్ తయారు చేయడం ద్వారా సేంద్రీయ ఎరువుల్ని వాడుకునే అవకాశం ఉంటుందని తెలియజేశారు.

శాంసంగ్ డీఎక్స్ విజన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వచ్చే నెల 5న ది ఫస్ట్ లుక్ ఈవెంట్లో తన డిఎక్స్ విభాగానికి సంబంధించిన 2026 విజన్ ను శాంసంగ్ రూపొందించిందని సంస్థ ప్రతినిధి కె.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఈవెంట్ సామ్సంగ్ న్యూస్ రూమ్, సామ్సంగ్ యూట్యూబ్ చానల్, సామ్సంగ్ టీవీ ప్లస్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అవుతుంన్నారు. జనవరి 7 వరకు విన్‌లాస్ వెగాస్లో సామ్సంగ్ ప్రత్యేక ప్రదర్శనలో మరిన్ని ఈవెంట్స్, ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు.

17న విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి మైలవరం : ఈ నెల 17న స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల విశ్రాంతి భవనంలో పెన్షనర్స్ డే సందర్భంగా 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మైలవరం ట్రెజరీ పరిధిలోని వారికి సన్మానం చేయడం జరుగుతుందని మైలవరం విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు జెడ్ నాగిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సన్మాన గ్రహీతలతో పాటు విశ్రాంత ఉద్యోగులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణ పరిధిలో సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా పత్రాలు (రికార్డులు) లేకుండా నడుపుతున్న 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన 20 మందిపై జరిమానాలు విధించారు. శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న లౌడ్, మోడిఫైడ్ సైలెన్సర్లు కలిగిన 5 వాహనాల సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి, రహదారులపై భద్రతను కాపాడేందుకు సహకరించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలు కాపాడడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండి చట్టాన్ని గౌరవిస్తూ సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకుల ప్రభావానికి లోనుకాకుండా పూర్తిగా చట్ట పరిధిలోనే ఉండాలని స్పష్టంగా హెచ్చరించారు. ఎన్నికల సమయంలో శాంతియుత వాతావరణాన్ని భంగం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి-వత్సవాయి : ఈ నెల 25న క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని అన్ని గ్రామాల్లో సందడి మొదలైంది. క్రైస్తవులు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు. యూత్ ఫెస్టివల్ సెమి క్రిస్టమస్ ఐక్య కృష్ణ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో చర్చలకు ప్రార్థనా మందిరాలు స్వరాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామాల్లో క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని ఇప్పటికే గృహాలు, చర్చిలు, ప్రార్థన మందిరాల వద్ద క్రిస్టమస్ స్టార్లు, ట్రీలు ఏర్పాటు చేస్తున్నారు. క్రీస్తు రాకను కాంక్షిస్తూ క్రైస్తవులు గ్రామాల్లోని కోడళ్ళు తమ ఇల్లు, ప్రార్థన మందిరాలపై ఏర్పాట్లు చేస్తున్న క్రిస్మస్ స్టార్లు ప్రత్యేక ఆకర్షణంగా నిలుస్తున్నాయి



ధాన్యం రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - మోపిదేవి : మండల కేంద్రమైన మోపిదేవి మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు ఆ శాఖల గురించి వివరించారు. పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మూడు స్క్రబ్ టైపస్ పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయని వైద్యులు డాక్టర్ శ్రీరామ్ సాయి తెలిపారు. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఆర్టీసీ బస్సులను ఆదివారం, మంగళవారంలో మోపిదేవి బైపాస్ మీదగా నడుపుతు న్నారని, దీంతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి వచ్చే భక్తులు దాదాపు కిలోమీటర్లు నడిచి వెళ్ళాల్సి వస్తుందని పలువురు సర్పంచులు ఆర్టీసీ అధికారులను ప్రశ్నించారు. అలాగా కుండా బస్టాండ్ వరకు బస్సులు నడపాలని కోరారు. రైతులు పంట పండించిన తర్వాత రోడ్లు వెంబడి ధాన్యాన్ని ఆరబెట్టుకుని అమ్ముకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని పెదప్రోలు గ్రామ సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు అన్నారు. రైతు సేవా కేంద్రంలో తేమ శాతం పరిశీలించకుండా మిల్లర్లు మళ్లీ ఎందుకు తేమశాతాన్ని పరిశీలిస్తున్నారని మండల వ్యవసాయ శాఖ అధికారిణి హెప్సిబా రాణిని అడిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జంగం స్వర్ణ భారతి, వైస్ ఎంపీపీలు నడకుదుటి జననీ కుమారి, కడవకొల్లు సీతారామాంజనేయులు, సూపరింటెంట్ పాండురంగారావు, మండల స్థాయి అధికారులు సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.





పాములపాడు వంతెన పరిశీలిస్తున్న సజ్జా శివకుమార్

త్వరలో వంతెన నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి- పెదపారుపూడి : మండలం లోని దోసపాడు - పాములపాడు మధ్య జొన్నపాడు కాలవపై వంతెన ఇటీవల కూలిపోయిన విషయం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దృష్టికి తీసుకెళ్లి అతిత్వరలో తాత్కాలికంగా తూములు పెట్టి దారి మార్గమునకు సుగమం చేసినట్లు టిడిపి సీనియర్ నేత సజ్జా శివకుమార్ ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు ఎమ్మెల్యే చొరవతో అతి త్వరలో ప్రభుత్వ నిధులు వెచ్చించి పూర్తిస్థాయిలో పక్కాగా వంతెన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ వంతెన నిర్మించడం ద్వారా పాములపాడు, రావులపాడు, దూళ్ళవాని గూడెం గ్రామాల విద్యార్థులు దోసపాడు ఉన్నత పాఠశాలకు, అలాగే ఆయా గ్రామాల ప్రజలు దోసపాడు రైల్వే స్టేషన్‌కి వెళ్లటానికి, రైతులు దోసపాడు రైస్ మిల్ కు ధాన్యం రవాణా చేయడానికి, రైతులు పొలాలకు వెళ్ళటానికి రావడానికి ఎంతో ఉపయోగకరమని సజ్జా వివరించారు.

పరమేశ్వరరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి -మోపిదేవి : మోపిదేవి మండలం కే.కొత్తపాలెంలో జనసేన పార్టీ క్రియా వాలంటీర్ తుటారం మురళిని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ఆదివారం పరామర్శించారు. మురళీ తండ్రి తుటారం పరమేశ్వరరావు ఇటీవల మృతిచెందగా వారి చిత్రపటానికి వెంకట్రామ్ నివాళులు అర్పించారు. పరమేశ్వరరావు మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట జనసేన పార్టీ మోపిదేవి మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ పూషడపు రత్నగోపాల్, పార్టీ నాయకులు మత్తి రాంప్రసాద్, మండలి రమణ, కైతేపల్లి యాకోబు తదితరులున్నారు.

నేడు పిజిఆర్‌ఎస్ రద్దు

ప్రజాశక్తి-విజయవాడ : భవాణ్ణు దీక్షా విరమణ కార్యక్రమ నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం భవాని దీక్షా విరమణ బందోబస్తు విధులలో నిమగ్నమై ఉన్నందున ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్‌లో సోమవారం (15తేదీ) నిర్వహించ వల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి. జి. ఆర్. ఎస్.) కార్యక్రమం రద్దు చేసినట్లు పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



ప్రజాశక్తి-విజయవాడ : నిత్యం ఊరూరా తిరుగుతూ, ఎన్నో శారీరక, మానసిక ఒత్తిళ్లతో అలసిపోయిన మెడికల్ మేనేజర్లు గెట్ టు గెదర్ పేరుతో ఆదివారం ఉత్సాహంగా కనిపించారు. ఏపీ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో వారు కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక నున్న మామిడి తోటల్లో ఆనందంగా గడిపారు. వందలాది కుటుంబాలు పాల్గొన్న ఈ కార్యక్రమం ఆద్యంతం ఆటపాటలతో హాయిగా సాగింది. పిల్లలతో పాటు మెడికల్ మేనేజర్ల కుటుంబసభ్యులు సినీ గీతాలకు నత్యాలు చేస్తూ చిందులేశారు. వందమందితో క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహవంతంగా జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సివిల్ జడ్జ్ దమ్మాలపాటి ధనరాజ్, ప్రముఖ న్యాయవాది వేపాటి రాజరత్నం పాల్గొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సాజిద్ షేక్, విజయవాడ బ్రాంచ్ అధ్యక్షుడు నాంచారయ్య, ఉపాధ్యక్షుడు కష్ణ కమల్, కార్యదర్శి రాజేష్, సహాయ కార్యదర్శి శివరాం, కోశాధికారి అబ్బాస్ తదితరులు పర్యవేక్షించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఇబ్రహీంపట్నం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఇబ్రహీంపట్నం సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం మండల యూటీఎఫ్ అధ్యక్షులుగా సముద్రాల సూర్యనారాయణ, ఉపాధ్యక్షు లుగా కరీముల్లా, ఉపాధ్యక్షురాలుగా పి మరియా కుమారి, కోశాధికారిగా ఫరూక్, ఆడిటర్‌గా కోటేశ్వరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పట్నాల నాగేశ్వరావు వ్యవహరించారు. ఎన్నికల పరిశీలకులుగా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి హరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం కానూరు పంచాయతీ పరిధిలోని పెదకా నూరు గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న పీత ధనలక్ష్మికి కృష్ణా జిల్లా తెలుగురైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో పీత రాము, బొమ్మిడి కొండ, గోపు వెంకట రమణ పాల్గొన్నారు.

పెద్ద మస్తాన్‌కు నివాళి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: మాజీ కార్మిక నాయకులు షేక్ పెద్ద మస్తాన్ మృతదేహాన్ని మాజీ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ సందర్శించి నివాళులు అర్పించారు. మస్తాన్ కార్మిక నాయకుడిగా కార్మికుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, ఆయన మృతి తీరని లోటు అని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మస్తాన్ కుమారుడు జానీ షరీఫ్‌ను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు. మస్తాన్ మృతదేహాన్ని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, టిడిపి కో- ఆప్షన్ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని సందర్శించి నివాళులర్పించారు.

17 నుంచి కుంభాభిషేకాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం పాగోలు లోని శ్రీశైవల్యాశ్రమ చలాచల భోదోపదేశ మందిర ప్రాంగణంలో ప్రతిష్టితమైన శ్రీకమలాత్మికా సహిత అచలేశ్వర స్వామి మందిర కుంభాభిషేకానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రీఅచలేశ్వర మందిరం పైభాగంలో శివలింగాకారంలో శిఖరాన్ని నిర్మించారు. అడుగుభాగంలో చుట్టూ కమలం ఆకారంలో సుందర నిర్మాణం చేపట్టారు. మందిరంపై ముందు భాగంలో శ్రీసదాశివమూర్తిని ప్రతిష్టించనున్నారు. కుంభాభిషేక పూజా కార్యక్రమాలు ఈనెల 17వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి.



పలుచోట్ల ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి-గుడివాడ : పట్టణంలో పలు కార్యక్రమల్లో ఆదివారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ఆటోనగర్ మూడో లైన్‌లో నిర్వహించిన గార్ని షరీఫ్ వేడుకల్లో, భవాని దీక్ష దారుల ఇరుముడి, పూజల్లో వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన గార్నీ వెడుకల్లో ముస్లి పెద్దలతో కలసి ఉత్సవాలు నిర్వహించారు. భక్తి శ్రద్దలతో దీక్షలు ముగించుకున్న సర్వమాలాదారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంల్లో టిడిపి రూరల్ అధ్యక్షుడు వాసే మురళీ, శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం ఈవో కందుల గోపాలరావు, చైర్మన్ పట్టపు చిన్న, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహనావు ,జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, వేమూరి త్రినాథ్, భవాని, షేక్ నాగూర్‌భాష, తదితరులు, పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాస వేడుకలు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నంలో పురాతన ఆలయంగా పేరొందిన రంగనాయక స్వామి దేవాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమవుతున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మగపాటి సత్యహరి ప్రసాద్, అభివద్ధి పాలకమండలి చైర్మన్ నల్లారి వెంకటేశ్వరరావు తెలిపారు. 15వ తేదీ సోమవారం స్వామివారి అభిషేకం, 16వ తేదీ ఉదయం 5 గంటలకు తిరుప్పావై ప్రవచనం, ప్రసాద్ గోష్టి, 29వ తేదీన స్వామికి ద్వాదశప్రదక్షిణలు, 30వ తేదీన వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం, జనవరి 14 తేదీన అంగరంగ వైభవంగా గోదా రంగనాదుల కళ్యాణం విశేషంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్రికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.



యువతకు స్ఫూర్తి ఎంవి కృష్ణారావు

ప్రజాశక్తి-అవనిగడ్డ : నేటి యువతకు స్ఫూర్తి ప్రదాత మండలి వెంకటకృష్ణారావు అని టిడిపి సీనియర్ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం అవనిగడ్డ వంతెన సెంటర్లో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి కీర్తిశేషులు మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకలు ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు విగ్రహానికి సుభాష్ చంద్రబోస్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం. చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, ఏఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-మొవ్వ : రైతాంగ సమస్యలను దృష్టిలో పెట్టుకుని తడిసిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యానికి ప్రభుత్వం నిబంధనలు సడలించి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ మొంథా తుపాను వల్ల రైతులు వరిధాన్యంలో మానుగాయ రావడం వల్ల పంటదిగుబడి తగ్గిందన్నారు. అలాగే ప్రభుత్వం రంగు మారిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని నిబంధనలు సడలించినట్లయితే రైతులకు చాలా మేలు జరిగి ఉండేదన్నారు. ఇప్పటికీ జిల్లాలో రహదారులపై ధాన్యపు రాశులు నిల్వలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. కావున ప్రభుత్వం రైతులకు కౌలు రైతులకు, లాభాలు చేకూర్చే విధంగా ధాన్యపు సేకరణలో నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని కోరారు.

రాష్ట్ర కమిటీకి ఎన్నికపై హర్షం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : తిరుపతిలో జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యవర్గంలో కృష్ణా జిల్లా ప్రతినిధులకు చోటు లభించింది. కృష్ణా జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ అధ్యక్షుడు కార్యదర్శులుగా ఉన్న బూర పూజిత, సమరం రాష్ట్ర కమిటీ ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు ప్రకటించారు.



ఘనంగా జ్వాలా స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లిలోని ఎన్నారై పాఠశాలలో జ్వాలా స్పోర్ట్స్ మీట్ పేరుతో క్రీడల పోటీలు ఘనంగా జరిగాయి. ఈ క్రీడల పోటీలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, గౌరవ అతిథిగా ఎన్నారై విద్యా సంస్థల డైరెక్టర్ పి.తిలక్ బాబు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్నారై సంస్థకు గుంటూరులోని రెండు పాఠశాలలు, విజయవాడ 1, గొల్లపూడి 1, కొండపల్లి 1 కలిపి ఐదు పాఠశాలల నుండి మొత్తం 500 మంది విద్యార్థులు క్రీడల పోటీలలో పాల్గొన్నారు. కబడ్డీ, కో కో, త్రో బాల్, వాలీ బాల్ వంటి క్రీడలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దఢత్వం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై ఎగ్జిక్యూటివ్ అకడమిక్ డైరెక్టర్, జాయింట్ సెక్రటరీ కొమ్మారెడ్డి చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మధుమేహ వైద్యంలో నూతన ఆవిష్కరణలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : డయాబెటీస్ విషయంలో అప్రమత్తంగా ఉంటూ ఆదిలోనే వైద్యులను సంప్రదించకపోతే భవిష్యత్తులో అనేక దుష్ఫలితాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని పలువురు వైద్యులు హెచ్చరించారు. డయాబెటీస్ కారణంగా తలెత్తే అనేక రుగ్మతలు, వాటి నివారణ తదితర అంశాలపై చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్ డయాబెటీస్ ఫెడరేషన్ (ఏపిడీఎఫ్ కాన్-2025), ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐ.ఎం.ఎ.) సంయుక్త ఆధ్వర్యంలో లబ్బీపేటలోని హోటల్ జీఆర్టీ గ్రాండ్‌లో ఆదివారం జాతీయస్థాయిలో నిర్వహించిన ఏపిడీఎఫ్ కాన్ 34వ సదస్సు విజయవంతంగా జరిగింది. ఏపిడీఎఫ్ కాన్ ప్రెసిడెంట్ అండ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ యలమంచి సదాశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ సూర్యదేవర కేశవరావుబాబు మాట్లాడుతూ.. మధుమేహ వ్యాధి నియంత్రణకు సంబంధించి ఇన్‌హేలర్స్ అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఎపిడిఎఫ్ కాన్ ప్రెసిడెంట్ అండ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ యలమంచి సదాశివరావు మాట్లాడుతూ.. జీఎల్‌పి ఎన్‌లాగ్ అందుబాటులోకి వచ్చాక డయాబెటీస్‌కు సంబంధించి ఉత్తమ ఫలితాలు కనబడుతున్నాయన్నారు. ఏపిడీఎఫ్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ యలమంచి ఐశ్వర్య, డాక్టర్ యలమంచి హిమన, డాక్టర్ అమూల్య మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలల్లో మధుమేహం వల్ల సంభవించే దుష్ఫలితాలను ఆదిలోనే నివారించడం ముఖ్యమని అటువంటి వారు వైద్యుల సూచనలు పాటించాలన్నారు. సెమినార్‌లో భాగంగా డాక్టర్ ఎల్.శ్రీనివాసమూర్తికి గోల్డ్ మెడల్‌ను అందజేసి ఘనంగా సత్కరించారు.





కథా రచనపై శిక్షణ

విజయవాడ : మానవ సంబంధాలను బలంగా చెప్పడమే ఆధునిక కథా రచయితల మౌలిక లక్షణమని చినుకు పత్రిక సంపాదకులు నండూరి రాజగోపాల్ అన్నారు. ఆదివారం శిఖామణి సెంటరులోని శిఖర స్కూలులో జరిగిన తెలుగు కథా శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. సభకు అధ్యక్షత వహించిన హైద్రాబాదు వేదిక వ్యవస్థాపకులు అనిల్ అట్లూరి కథాశిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కథా నిర్మాణం, పాత్రల రూపకల్పనపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ విమర్శకులు డాక్టర్ సశ్రీ మాట్లాడుతూ మంచి పాఠకులు మాత్రమే గొప్ప రచయితలు కాగలరని, బాగా రాయాలంటే సాహిత్యాన్ని, సమాజాన్ని బాగా చదవాలన్నారు. శిఖర డైరెక్టర్ బండ్ల మాధవరావు, సీనియర్ అధ్యాపకురాలు కల్పన, అధ్యాపకులు డా.వి.పవన్ కుమార్ రెడ్డి మాట్లాడారు.

భవానీలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం

- **వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : భవానీలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. భవానీ దీక్ష విరమణల సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ వారు మెరుగైన పారిశుధ్య నిర్వహణతో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణన్ని అందిస్తున్నామని తెలిపారు. భవానీ దీక్ష విరమణకు వచ్చే భవానీలకు 47 ప్రదేశాలలో, 1690 మంది పారిశుద్ధ్య కార్మికులతో ప్రతినిత్యం పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్నామని అన్నారు. భవాని విడిచిన దుస్తులనుకన్వేయర్ బెల్ట్ ద్వారా ఎప్పటికప్పుడు తొలగిస్తూ, 28 ప్రదేశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తూ, భవాని భక్తులకు మంచినీరు అందించడమే కాకుండా, వారి సామాన్లను, చెప్పులను భద్రపరుస్తూ డ్రోన్లతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.



21న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరువూరు : జన విజ్ఞానవేదిక (జెవివి) తిరువూరు శాఖ, జిబిఆర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకొక్కసారి మూడవ ఆదివారం నిర్వహించే బిపి, షుగర్, ఫిట్స్ వ్యాధి రోగుల రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఈ నెల 21న తిరువూరు నాగార్జున ఉన్నత పాఠశాలలో జరనున్నట్లు జెవివి నాయకులు కడిమి పాపారావు తెలిపారు. క్యాంప్‌నకు వచ్చే రోగులు రెండ్రోజుల ముందుగా షుగరు, బిపి, పరీక్షలు చేయించుకుని రిపోర్టులతో విజ్ఞప్తి చేశారు. ఉదయం 5 గంటల నుండి క్యాంప్ ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 9491545653, 9492487133, 9441056670 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

నేడు పిజిఆర్‌ఎస్ రద్దు

ప్రజాశక్తి-విజయవాడ : ఈ నెల 11వ తేదీన ప్రారంభమైన భవానీ దీక్షల విరమణ కార్యక్రమం 15వ తేదీ వరకు జరగనుందని.. ఈ కార్యక్రమం నిర్వహణ విధుల్లో జిల్లా అధికారులు నిమగ్నమై ఉన్నందున ఈ నెల 15న కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జిల్లాస్థాయి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి సోమవారం నుంచి జిల్లాస్థాయి పేజీఆర్ఎస్ కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని తెలిపారు. డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో మాత్రం ఎప్పటిలానే అర్జీలు స్వీకరిస్తారన్నారు. అర్జీదారులు అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.



ఉత్సాహంగా శైలు స్వరాభిషేకం

విజయవాడ : క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక గాంధీనగర్ ఆశీష్ స్టూడియోస్ లో "శైలు స్వరాభిషేకం" (సీజన్ 9) ఉత్సాహంగా జరిగింది. గాయకులు శైలు, చాంద్ బాషా ఆధ్వర్యంలో జి.శ్రీనివాస్, వెంకటేష్, అర్జున్, కనకారావు, మోహన్ కష్ణ, మున్నాభాయ్, శ్రీనివాస్, పాండు, సత్యస్వాతి, సరళ, సుకన్య, సుమలత, జ్యోతి, బాలాజీ దయాళ్ తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు వివిధ సినిమాల్లోని పాటలు పాడి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. సౌండ్ అండ్ ట్రాక్: సూర్య.

అలరించిన వాగ్గేయకారుల గానం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నెలవారీ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఉదయం వాగ్గేయకారుల రచనలతో జరిగిన సంగీత సభా కార్యక్రమాలు శ్రోతలకు భక్తి తత్వంతోపాటు సంగీత, సాహిత్యాల వైభవాన్ని తెలిపాయి. వాగ్గేయకారుల రచనలలోని భక్తి, సంగీత, సాహిత్య వైభవాన్ని వర్ధమాన కళాకారులు అర్థం చేసుకుంటూ శ్రోతలకు చేరువ చేసేందుకు శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత కళాపీఠం కళావేదికపై ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు అర్థాఖండ మహోత్సవాన్ని వాగ్గేయకారులను స్మరించుకుంటూ నిర్వహించింది. ఆత్మీయ అతిథిగా గాత్ర సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, ముఖ్యఅతిథిగా గుండె వైద్య నిపుణులు డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావులు విచ్చేసి మాట్లాడుతూ సంగీతం మానసిక వికాసానికి, సాహిత్యం బుద్ధి వికాసానికి చేరువ చేస్తాయని, సంగీత సాహిత్యాలతో అనుబంధం ఉన్నవారు శారీరకమైన రోగాలకు దూరం అవుతారన్నారు. దాదాపు వంద మంది వర్ధమాన కళాకారులు, విద్వాంసులు వీణవాద్యంతో, వయోలిన్ వాద్యంతో వీణ కుప్పయ్యర్, స్వాతి తిరునాళ్, సుబ్బరాయ శాస్త్రి, రామనాడ్ శ్రీనివాస అయ్యంగార్, మైసూర్ వాసుదేవాచార్య, పొన్నయ్య పిళ్ళై, ముత్తయ్య భాగవతార్, పల్లవి గోపాలయ్యర్, పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్, జిఎన్ బాలసుబ్రహ్మణ్యం రెండవ తరం వాగ్గేయకారుల కీర్తనలు, సంకీర్తనలు, కతులు పాడి ఆహుతులను భక్తి రస సాగరంలో విహరింప చేశారు. కళా పీఠం అధ్యక్షుడు డాక్టర్ మన్నం గోపీచంద్ నేతత్వంలో కార్యదర్శి సివి రావు పర్యవేక్షించగా ఉపాధ్యక్షురాలుచిట్టా రామలక్ష్మి సంగీత కచేరీల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించారు.



సృజనాత్మకతను వెలికితీయాలి

విజయవాడ : ఠాగూర్ గ్రంథాలయంలో చదవటం మాకిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిన్నారులకు తెనాలికి చెందిన సుబ్బారావు క్రాఫ్ట్ పేపర్లతో పువ్వులు నేర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయా ధికారి రమాదేవి మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయటానికి ఈ క్రాఫ్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు



28న ఎపి ఎన్‌జిఒ నగరశాఖ ఎన్నికలు

- **ఎన్నికల అధికారి వి.వి.ప్రసాద్**

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ విజయవాడ నగర శాఖకు ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్లు ఎన్నికల అధికారి ఎపి ఎన్‌జిఒ జిల్లా సహాధ్యక్షులు వి.వి.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ విజయవాడ నగర శాఖ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను ఈ నెల 16న ఎన్‌జిఒ హోమ్‌లో పబ్లిష్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలకు నామినేషన్లు డిసెంబర్ 22న స్వీకరించడం జరుగుతుందన్నారు. నగర శాఖకు సంబంధించి అధ్యక్షుడు 1, సహాధ్యక్షులు 1, కార్యదర్శి,1, కోశాధికారి 1, కార్యనిర్వాహక కార్యదర్శి-1, ఉపాధ్యక్షులు-4, మహిళా ఉపాధ్యక్షురాలు -1, సంయుక్త కార్యదర్శి- 5 మహిళ సంయుక్త కార్యదర్శి 1, డిఈసి మెంబర్లు 5 కలిపి మొత్తం 21 పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 22న నామినేషన్లు స్వీకరిస్తామని, అదేరోజు నామినేషన్ల పరిశీలన, అర్హుల జాబితా ప్రచురణ, నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రచురణ నిర్వహిస్తామన్నారు. ఒక్కొక్క పోస్ట్‌కు ఒక నామినేషన్ మాత్రమే దాఖలైతే అదే రోజున ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తామని, ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేస్తే 28న ఎన్నికలు నిర్వహించి అదే రోజు కౌంటింగ్ అనంతరం ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని ఎన్నికల అధికారి వి.వి.ప్రసాద్ తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణను, పర్యవేక్షకుడిగా జిల్లా కోశాధికారి బి.సతీష్ కుమార్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు డి.సత్యనారాయణ రెడ్డి ఆదేశాలు జారీచేసినట్లు ఎన్నికల అధికారి ప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు.



నేడు ఎప్టానిక్స్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రముఖ డీప్ టెక్నాలజీ సంస్థలలో ఒకటైన ఎఫ్టానిక్స్ సిస్టమ్స్ ప్రవేట్ లిమిటెడ్ 40వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 15న సి.కె.కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకృష్ణ తెలిపారు. ఆటోనగర్ ఐటీ పార్క్‌లో గల సంస్థ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాల కాలంలో ఎఫ్టానిక్స్ సుమారు 1700 కోట్ల సమష్టి ఆదాయాన్ని సాధించిందని తెలిపారు. సంస్థ అభివద్ధి చేసిన అన్ని ప్రధాన ఉత్పత్తులు, టెక్నాలజీ ఫ్లాట్ ఫోరంలు,పూర్తిగా దేశీయంగా రూపొందించినట్లు తెలిపారు. వీటి ద్వారా రైల్వే వంటి కీలక రంగాలలో దిగుమతి సాంకేతికతలపై భారత్ ఆధారపడటం గణనీయంగా తగ్గిందని అన్నారు. సంస్థ చీఫ్ ఇంజనీర్ సంబిరెడ్డి మాట్లాడుతూ ఎఫ్టానిక్స్ అభివృద్ధి చేసిన డేటా లాగర్ సిగ్నలింగ్ వ్యవస్థ నుండి అధిక స్పష్టతతో డేటాను సేకరించి ప్రత్యేక సాఫ్టవేర్ ద్వారా ఎమి జరిగింది, ఎందుకు జరిగింది, ఏ చర్య తీసుకోవాలో అనే విషయాన్ని స్పష్టమైన సమాచారం అందిస్తున్నామని అన్నారు. సంస్థ అభివృద్ధిలో భాగంగా సోమవారం జరిగే వేడుకల్లో పలువురు అభివృద్ధికి కృషి చేసిన వారిని సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు దాసరి అన్వేష్, మురళీ కష్ణ, వెంకట్ అప్పారావు పాల్గొన్నారు.

